క్లుప్తంగా

కంటి వైద్యశిబిరం విజయవంతం



నేత్ర వైద్యశిబిరంలో నిర్వహిస్తున్న పరీక్షలు

సాలూరు: పట్టణంలోని చినబజార్ వద్ద శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో 82 మందికి కంటిపరీక్షలు చేయగా36 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యురాలు డా.దివ్య గుర్తించారు.కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్ జోగారావు, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దాం



ఎన్నికైన ఫొటో, వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గం

పార్వతీపురంటౌన్: ఫొటో, వీడియో గ్రాఫర్ల అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని ఫొటోగ్రాఫర్ల సంక్షేమసంఘం అధ్యక్షుడు బి.అజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీఓ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి, సంక్షేమ పథకాల సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా బి.అజిత్‌కుమార్, వైస్‌ప్రెసిడెంట్‌గా ఇ.దుర్గాప్రసాద్, సెక్రటరీగా సీహెచ్ ముఖేష్, జాయింట్ సెక్రటరీగా జి.శ్రావణ్ కుమార్, ట్రెజరర్‌గా టి.సందీప్ చక్రవర్తిని ఎన్నుకున్నారు.

బోరబందలో పొలంపిలుస్తోంది




పత్తి పంటలో రైతులకు సస్యరక్షణ పద్ధతులు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

సాలూరు రూరల్: మండలంలోని బోరబంద, గుమడాం గ్రామాల్లో ఏఓ శిరీష ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు వరి, మొక్కజొన్న, పత్తి పంటల సస్యరక్షణ చర్యలు ఏవిధంగా చేపట్టాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే రస్తాకుంటుబాయి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబ్జెక్టు మేటర్ స్పెషలిస్ట్ అమృత వీణ మాట్లాడుతూ వరి , మొక్కజొన్న యాజమాన్య పద్ధతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పొలంబడిలో రైతులకు అవగాహన

సీతానగరం: వరి పంటలో కీటక నియంత్రణకు పసుపు రంగు జిగురు అట్టల వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు లక్ష్మీపురం గ్రామంలో పొలంబడి ప్రత్యేక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ మాట్లాడుతూ పసుపు రంగు జిగురు అట్టలు వరి పంటలో తెల్ల రసం పీల్చే వంటి కీటకాలను సహజ పద్ధతిలో నియంత్రించడంలో అత్యంత ప్రభావకరంగా పనిచేస్తాయని తెలిపారు. ఎకరాకి 10–15 అట్టలు ఏర్పాటు చేయాలని, వాటిని భూమి నుంచి 6–8 అడుగుల ఎత్తులో ఉంచాలని ఏఓ సూచించారు. వారానికి ఒకసారి అట్టలను తనిఖీ చేసి, అవసరమైతే మార్చాలని సిఫార్సు చేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంచినీరు సరఫరాపై జాగ్రత్తచర్యలు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలకు కలుషితం కాని తాగునీరు సరఫరా చేయడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని పార్వతీపురం సబ్‌డివిజినల్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని చినభోగిలిలో ఏర్పడిన మంచినీటి సమస్య పరిష్కరించడానికి ఏఈ పవన్‌కుమార్, సర్పంచ్ కురమాన రాధలతో కలిసి మంచినీటి పైప్‌లైన్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా వరదలకు పంప్‌ల ద్వారా వచ్చే బురద నీటిని శుద్ధి చేయడంతోనే మంచినీరు సరఫరా జరుగుతుందని తెలియ జేశారు. ఈ నేపథ్యంలో చినభోగిలిలో పైప్‌లైన్‌లు మరమ్మతుల బారిన పడడంతో పదిరోజులుగా ఎదుర్కొంటున్న మంచినీరు సమస్య పరిష్కారమైందని తెలియ జేశారు. అలాగే అన్నిగ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం వాటర్ ట్యాంక్, ఇంటింటి కుళాయిలను పరిశీలించారు.

బరువైన ఎరువు

- బస్తాకు రూ.70 నుంచి రూ.100 అదనపు భారం
- ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా ఫలితం శూన్యం





కరడవలసకు గత ప్రభుత్వంలో వేసిన బీటీ రోడ్డు. (ఇన్‌సెట్లో) సాలూరు రైతు భరోసా కేంద్రం నుంచి ఆటోలో ఎరువులు వేస్తున్న బెల్లపాక గిరిజన రైతులు

సాలూరు రూరల్:

మండలంలోని కరడవలస పంచాయతీ గ్రామాలైన బెల్లపాక, నారింజపాడు కరడ కొత్తవలస, కరడవలస గిరిజనులు ఎరువు కోసం పడరాని పాట్లు పడుతున్నారు.తమ గ్రామాలకు ఎరువు చేరేందుకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఎరువుకోసం అదనపు ఆర్థిక భారం తప్పడం లేదని వాపోతున్నారు. సాలూరు పట్టణానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరడవలస పంచాయతీ జిల్లేడు వలస సచివాలయం పరిధిలో ఉంది. అయితే అక్కడ రైతులకు ఎరువులు కావాలంటే జిల్లేడు వలస సచివాలయానికి వెళ్లాల్సి ఉంది. జిల్లేడు వలస నుంచి కరడవలసకు రోడ్డు మార్గం లేకపోవడంతో వారంతా సాలూరు పట్టణం మీదుగా జిల్లేడు వలస చేరుకోవాల్సి ఉంటుంది. దీనికి ఒక వైపు 45 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే జిల్లేడు వలసకు కూడా రోడ్డు మార్గం పెద్దపెద్ద గోతులతో ఉండడంతో అక్కడికి కూడా ఎరువులతో భారీ వాహనాలు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో సాలూరు రైతు భరోసా కేంద్రంలో జిల్లేడు సచివాలయానికి సంబంధించిన ఎరువులు నిల్వ ఉంచారు.ఇటు జిల్లేడు వలస, అటు కరడవలస రైతులు సాలూరు పట్టణంలోని రైతు భరోసా కేంద్రం నుంచి ఎరువులు తీసుకుని వెళ్తున్నారు. దీనికి ఒక్కో బస్తాకు రూ.70 నుంచి రూ.100 అదనపు భారం భరించాల్సి వస్తోందని గిరిజన రైతులు వాపోతున్నారు.

కరడవలసకు గత ప్రభుత్వంలో బీటీ రోడ్డు

ఇదిలా ఉండగా గత ప్రభుత్వంలో కరడవలసకు బీటీరోడ్డు నిర్మాణం జరిగింది. సాలూరు నుంచి నేరుగా గ్రామంలోకి భారీ వాహనాలు చేరుకునే పరిస్థితి ఉండేది. అలాంటప్పుడు కనీసం కరడవలస పంచాయతీకి చెందిన నాలుగు గ్రామాల గిరిజన రైతులకైనా ఎరువులు అందించే ఏర్పాటు చేస్తే బాగుంటుందని గిరిజన రైతులు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం ఉన్నా ఎరువుల కోసం సాలూరు రాక

కరడవలసకు గత ప్రభుత్వంలో రోడ్డు సౌకర్యం కల్పించినప్పటికీ ఎరువులు తమ గ్రామానికి అందించడం లేదు. గతంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినా ప్రయోజనం లేకపోయింది.

శంకర్రావు, కరడవలస సర్పంచ్

ఎరువు కోసం బస్తాకు రూ.70 చెల్లిస్తున్నాం



ఒక బస్తా ఎరువు ఇంటికి చేరాలంటే రూ.70 చార్జీ చెల్లించాల్సి వస్తోంది. కొంతమంది రైతులం కలిసి ఆటో మాట్లాడుకుని ఎరువులు సాలూరు నుంచి తీసుకు వెళ్తున్నాం. మా గ్రామాలకు దగ్గరగా ఉన్న కరడవలసలో ఎరువులు అందుబాటులో ఉంచాలి.

జి.బాలకృష్ణ, బెల్లపాక, కరడవలస పంచాయతీ

ఎరువు కోసం గిరిజన రైతుల నిరసన



సారిక సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

సాలూరు రూరల్: గిరిజన రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయాలని మండలంలోని సారిక సచివాలయం ఎదుట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గిరిజన రైతులు మంగళవారం నిరసన తెలిపారు. సచివాలయాల చుట్టూ రోజులు తరబడి తిరుగుతున్నా డీఏపీ, యూరియా వంటి ఎరువులు గిరిజన రైతులకు సరిపడా అందించడంలేదని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆరోపించారు. గంజాయిభద్ర పరిధిలోని గిరిజనులకు ఎరువుల అవసరాన్ని అధికారులు గుర్తించాలని డిమాండ్ చేశారు. సాగును, అవసరాన్ని బట్టి ఎరువులు పంపిణీచేయాల్సింది పోయి అసలు గిరిజన రైతులకు ఎరువులు అందించాలన్న ఉద్దేశం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో తాడంగి సన్నం, బుచ్చయ్య,సీదరపు బాల తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తప్ప కానరాని దారి





పులిగుమ్మి సమీపంలో గుంతలమయమైన రహదారి, (ఇన్‌సెట్లో) బందలుప్పి నుంచి మరిపివలసవైపు వెళ్లేందుకు ఉన్న రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు

పార్వతీపురం రూరల్: మండలంలోని పులిగుమ్మి రహదారి రోడ్డులా కాకుండా మార్పుచెంది గుంతలమయమైంది. మరిపివలస నుంచి పులిగుమ్మి గ్రామంతో పాటు బందలుప్పి, తాళ్లబురిడి, లచ్చ రాజుపేట, జమదాలతో పాటు మక్కువ మండల ప్రాంతాలతో పాటు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాలకు వెళ్లి తిరిగి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఈ దారిలో నిత్యం ఎంతోమంది వాహన చోదకులు ప్రయాణాలు చేస్తుంటారు. అయితే దారంతా గుంతలమయమై రహదారి రెండువైపులా కోతకు గురై దారుణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14నెలలు కావస్తున్నా రహదారి నిర్మాణం మాటే ఎక్కడా ఎత్తకపోవడంతో రహదారి కాస్తా మరింత గోతులమయమ వుతోంది.

మంత్రి సంధ్యారాణి సొంతూరులో నిలిచిన రాకపోకలు



గోముఖి రెగ్యులేటర్ ద్వారా నీరు విడిచిపెట్టిన దృశ్యం



మంత్రి సొంతూరు కవిరిపల్లి నది కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

- గోముఖ రెగ్యులేటర్ ద్వారా నీరు విడుదలచేసిన అధికారులు
- కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు
- ఏటా అవస్థలు పడుతున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మక్కువ: వర్షాకాలం వచ్చిందంటే మక్కువ, సాలూరు మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వర్షాకాలంలో నిత్యం వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ గోముఖి రెగ్యులేటర్ ద్వారా, గోముఖినదిలోకి నీరు విడిచిపెట్టడం, కాజ్ వేపై నుంచి నీరు ప్రవహించడంతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడడం షరా మామూలే. సాక్షాత్తు గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జన్మించిన సొంతూరు కవిరిపల్లి గ్రామం వద్ద ఏటా ఈ పరిస్థితి నెలకొంటోంది.

600క్యూసెక్కుల నీరు విడుదల

వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ రెగ్యులేటర్ ద్వారా మంగళవారం 600క్యూసెక్కుల నీటిని గోముఖినదిలోకి ఇరిగేషన్ అధికారులు విడిచిపెట్టారు. దీంతో కవిరిపల్లి, సరాయివలస, బంగారువలస గ్రామాల సమీపంలోని గోముఖి నది ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడంది. వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్‌లోకి అధికంగా ఇన్‌ఫ్లో చేరుతుండడంతో, ముందస్తు చర్యల్లో భాగంగా గోముఖి నదిలోకి నీటిని విడిచిపెట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కాజ్‌వే ఏర్పాటు

కవిరిపల్లి గ్రామం వద్దనున్న గోముఖినదిపై నుంచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మాజీ ఎంపీ కిశోర్‌చంద్రదేవ్ సుమారు రూ.26లక్షల నిధులు మంజూరుచేసి కవిరిపల్లి గ్రామం సమీపంలో కాజ్‌వే నిర్మించారు. అయితే కాజ్‌వే ఎత్తు తక్కువగా ఉన్నందున, వీఆర్ఎస్ ప్రాజెక్ట్ నుంచి నదిలోకి 500క్యూసెక్‌లు నీటిని విడిచిపెట్టినా కాజ్‌వేపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో కవిరిపల్లి, శంబర, తోటవలస, ఎస్.పెద్దవలస తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోతుంటాయి. ప్రస్తుతం గిరిజన శాఖ మంత్రిగా, గతంలో ఎమ్మెల్సీగా పదవిలో సంధ్యారాణి ఉన్నప్పటికీ సొంతూరు వద్ద గోముఖినదిపై బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు తీసుకోవడంలేదంటూ ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా మంత్రి సంధ్యారాణి స్పందించి కనీసం గోమఖినదిపై మినీబ్రిడ్జి అయినా నిర్మించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పెదంకలాం ఆనకట్ట ద్వారా సాగునీరందిస్తాం

- డీఈఈ పి.నారాయణ

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: సువర్ణముఖి నదిపై ఉన్న ఆనకట్ట ప్రధాన కాలువ ద్వారా ఈ ఏడాది ఖరీఫ్‌కు ఇబ్బంది లేకుండా సాగునీరు అందిస్తామని జల వనరుల శాఖ బొబ్బిలి నీటిపారుదల ఉప విభాగం కార్య నిర్వాహక ఇంజినీర్ పి. . నారాయణ తెలిపారు. ఈనెల 18వ తేదీన సాక్షి పత్రికలో ప్రచురితమైన ప్రమాదకరంగా పెదంకలాం డ్యామ్ శీర్షికపై మంగళవారం ఆయన స్పందించారు. పెదంకలాం ఆనకట్టపై చినంకలాం, పెదంకలాం గ్రామాల మధ్య సువర్ణముఖి నదిపై ఉన్న ఆనకట్ట ద్వారా నీరు నిల్వ ఉంచి సుమారు 8 వేల ఎకరాల భూమికి సాగునీరు అందించే పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆనకట్ట వద్ద అభివృద్ధి పనులు పునఃప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పెదంకలాం ప్రధాన కాలువ నిర్వహణ పనులు చేపట్టి అవసరమైన మేరకు పూడక తీత, గండ్లను పూడ్చివేసి కాలువ ద్వారా సాగు నీరు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మిగిలిన పనులను కూడా సకాలంలో పూర్తి చేసి ప్రధాన కాలువ ద్వారా ఈ ఏడాది ఖరీఫ్‌కు ఇబ్బంది లేకుండా ఆయకట్టుకు సాగు నీరందిస్తామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

కాజ్‌వేను పరిశీలించిన తహసీల్దార్



దండిగాం కాజ్‌వేను పరిశీలిస్తున్న తాహసీల్దార్ నీలకంఠరావు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు రూరల్: తుఫాన్ కారణంగా దండిగాం కాజ్ వేపై నుంచి సువర్ణ ముఖి నది పొంగి పొర్లడంతో కురుకూటి, దళాయి వలస తదితర గిరిజన గ్రామాలకు రాకపోకలు నిచిపోయిన విషయాన్ని సాక్షి పత్రికలో ప్రచురించడంతో తహసీల్దార్ నీలకంఠరావు స్పందించారు. ఈ మేరకు ఆ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షం తగ్గడంతో వరద ఉధృతి పూర్తిగా తగ్గడంతో ఆయా గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగుతున్నాయని తహసీల్దార్ తెలిపారు. కాజ్‌వే పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో రానున్న రోజుల్లో మరింత ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు సంప్రదించండి



ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు బుధవారం నుంచి డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుందని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లకు విద్యార్థులు సంప్రదించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఉన్న తమ కళాశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో మంచి ఫలితాలు సాధిస్తున్న కళాశాల అని తెలిపారు.

కళాశాలలో ఎన్‌సీసీ కూడా ఉందన్నారు. రెండు పూటలా తమ కళాశాల నడుస్తుందని, డిగ్రీలో మంచి ఫలితాలను సాధిస్తున్న కళాశాల అని చెప్పారు. పూర్తిస్థాయి ల్యాబొరేటరీ, లైబ్రరీ, బోధన సిబ్బంది, భవనాలు, మౌలిక సదుపాయాలు, పచ్చని మైదానం, క్రీడాసముదాయం కలిగిన కళాశాల అని వివరించారు. విద్యార్థులకు విద్యా బోధనతోపాటు ఉద్యోగపరమైన అంశాలలో కూడా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ కోర్సులపై అవగాహన, శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్, టీబీ ముక్త్ భారత్‌పై శిక్షణ

- డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు చేరువయ్యే దిశగా శిక్షణను సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు స్పష్టం చేశారు. వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్, టీబీ ముక్త్ భారత్ లపై జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, అధికారులు శిక్షణ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ప్రతి ఒక్కరికీ అభా గుర్తింపు ఉండాలని తద్వారా ఆరోగ్య తనిఖీల కోసం ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ వారి ఆధార్ లేదా మొబైల్ నంబర్‌తో అభా గుర్తింపు నంబర్ జనరేట్ చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో అభా నంబర్‌తో వారి ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని చెప్పారు. ఇలా ఏ ప్రాంతంలో నైనా ఆస్పత్రులకు వెళ్లిన వారి వివరాలు ఈహెచ్‌ఆర్‌లో పొందు పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీడీఎం ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జె.కోటిరెడ్డి, డీఐఓ డా.విజయమోహన్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డా. టి. జగన్మోహనరావు, డా.రఘు కుమార్, డా.ఎం.వినోద్ కుమార్, డా.కౌశిక్, డెమో సన్యాసిరావు, ఐటీ సిబ్బంది జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో సంపద సృష్టి కేంద్రం



సంపద సృష్టి కేంద్రం చుట్టూ పెరిగిన దొంకలు

సాలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంపద సృష్టి కేంద్రాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఈ మేరకు సాలూరు మండలంలోని కరాసువలస పంచాయతీలో సంపద సృష్టి కేంద్రం నిర్వహణలో లేకపోవడంతో కేంద్రం చుట్టు పక్కల తుప్పలు, దొంకలు నిండిపోయాయి. గ్రామంలో చెత్తలు సేకరించి పిట్స్‌లో వేయాల్సి ఉండగా ఆ చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే ఈ కేంద్రం గ్రామానికి చెందిన మేకలు సేదతీరేందుకు ఉపయోగపడుతోంది.

ఎంఈఓలకు అవార్డులు అందజేయాలి

పార్వతీపురం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంఈఓలకు అవార్డులను అందజేయాలని ఎంఈఓ–1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంఈఓలకు అవార్డులను అందజేయాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో విద్యారంగ అభివృద్ధి, కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న ఎంఈఓలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

ఎంఈఓల సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులతోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎంఈఓలకు కూడా అవార్డు ఇచ్చి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

- సీపీఎం ఆధ్వర్యంలో కేశలి గ్రామస్తుల నిరసన



పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ మురికి గుంటల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న స్థానిక ప్రజలు

పాచిపెంట:

మండలంలోని కేశలి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మంగళవారం నిరసన తెలియజేశారు. గ్రామంలో ఎక్కడ చూసినా పారిశుద్ధ్య లోపం ఎక్కువగా ఉందని అసలే వర్షాకాలం కావడంతో మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు, గ్రామ పెద్దలు ఆకుల రామారావు, యాగంటి గురువులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో నిధులు లేవు..

పంచాయతీలో నిధులు లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు చేపట్టలేకపోతున్నామని కేశలి సర్పంచ్ సత్తారపు నిర్మల తెలియజేశారు. పంచాయతీలో మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రీన్ అంబాసిడర్స్‌కు(పారిశుద్ధ్య కార్మికులు) జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంచాయతీలో జమ చేయలేదని తద్వారా ఈ పరిస్థితి నెలకొందని ఆమె పేర్కొన్నారు.

చినుకుపడినా.. చింతలేకుండా రాకపోకలు

- గత ప్రభుత్వంలో తొలగిన వంతెన కష్టాలు

సాలూరు:

చినుకుపడితే వారికి చింతే. వర్షం తీవ్రత పెరిగే కొద్దీ వారి గుండెల్లో గుబులు అధికమవుతుంది. జలదిగ్బంధంలో ఉన్న తమ గ్రామాలకు మళ్లీ రాకపోకలు ఎప్పుడు సాగిస్తాం. వరద ఉధృతి ఎప్పుడు తగ్గుతుందా? అని బిక్కు బిక్కుమంటున్న ప్రజలకు తుఫాన్ అంటే వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు ప్రతి రోజూ పనిచేయాల్సిందే. ఈ క్రమంలో పనుల మీద బయటకు వెళ్లే ప్రజలు తిరిగి గ్రామానికి చేరుకునే సమయంలో వరద ప్రభావం వల్ల రోడ్లు దాటలేని దుస్థితి. ఇది 2019 ముందు వరకు నియోజకవర్గంలో వందలాది గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజల పరిస్థితి. 2019 తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాటి ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర చొరవతో వందలాది గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజలకు వంతెన కష్టాలు తొలగాయి. దాదాపు దశాబ్దాల వంతెన కష్టాలను తీర్చిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తయిన వంతెనల వివరాలిలా..



పూర్తయిన కందులపథం వంతెన



పూర్తయిన మోసూరు వంతెన



నిర్మాణమవుతున్న బట్టివలస వంతెన



ఈతమానువలస బ్రిడ్జి